ఈద్గా వద్ద ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న అనంతపురం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

ఎన్నికల వేళ అటు..ఇటు..!

- మారుతున్న పార్టీ కండువాలు
- మొన్న ఆ పార్టీ.. నేడు ప్రత్యర్థి పార్టీలోకి వలస
- చేరికలను ప్రోత్సహిస్తున్న టిడిపి, వైసిపి నేతలు

ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయాలు రోజురోజుకు వేడెక్కుతున్నాయి. నాయకులు సుడిగాలి ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో సర్వశక్తులను ఒడ్డుతున్నారు. ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోకుండా సర్వశక్తులనూ ఒడ్డుతున్నారు. ఈ సమయంలో పక్క పార్టీలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులకు గాలం వేస్తున్నారు. ఎలాగైనా వారిని తమ వైపు తిప్పుకుని వారి వద్ద ఉన్న కొద్దిపాటి ఓటు బ్యాంకును సొంతం చేసుకోవాలని పావులు కదుపుతున్నారు. జిల్లాలో టిడిపి, వైసిపి రెండు పార్టీలూ ఈ పద్ధతిని చాలా వేగంగా కానిస్తున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో కండువాలు అటు.. ఇటు మారుతున్నాయి. కొందరు నాయకులు అయితే ఉదయం ఒక పార్టీలో రాత్రి మరొక పార్టీలో ఉంటున్నారు. అభ్యర్థులు అయితే తమ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయని తెలిసేలా చేరికలను ప్రోత్సహిస్తూ తమ బలం పెరిగింది అనేలా ప్రచారం చేసుకుంటున్నారు.

ప్రజాశక్తి - అనంతపురం

గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి పోటీ హోరాహోరీగానే సాగుతోంది. అభ్యర్థులను ముందస్తుగా ప్రకటించేయడం, నామినేషన్ల కంటే ముందుగానే ఒక విడత ప్రచారం ముగించడం లాంటి కార్యక్రమాలతో పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసొచ్చే నాయకులను తమ పార్టీలోకి చేర్చుకునేందుకు సిద్ధపడుతున్నారు. గతంలో వారితో ఎంతటి వైరం ఉన్నా వాటిని పక్కన బెట్టి వారి పార్టీ కండువాను వేసేస్తున్నారు. దీంతో రాత్రికిరాత్రే సమీకరణాలు మారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోని ఇదే పరిస్థితి కన్పిస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో అయితే ఏకంగా ప్రతి రోజు కండువాలు కప్పే కార్యక్రమాన్ని ఒక దినచర్యగా చేస్తున్నారు. ప్రతి రోజూ వార్డుల వారీగా తమ పార్టీలో చేరుతున్నారంటూ ప్రకటనలు చేస్తున్నారు. ముఖ్య నాయకులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా పార్టీలు మారుతుండడం గమనార్హం. ఈ మధ్యనే అనంతపురం అర్బన్, కదిరి, హిందూపురం, తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల్లో ఏకంగా కార్పొరేటర్లు, కౌన్సిలర్లు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. అదే క్రమంలో టిడిపి నుంచి వైసిపిలోకి చేరికలు కొనసాగుతున్నాయి. గురువారం నాడు గుంతకల్లు నియోజకవర్గంలో ఏకంగా ఐదుగురు వైసిపి తాజా కౌన్సిలర్లు, ఒక మాజీ కౌన్సిలర్లు ఆపార్టీని వీడి టిడిపిలో చేరారు.

భవిష్యత్తుపై భరోసా

పార్టీలు మారే సమయంలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అభ్యర్థులు నాయకులకు భారీ ప్యాకేజీలను హామీల రూపంలో గుప్పిస్తున్నారు. అధికారంలోకి వస్తే పదవులు ఇస్తామని, నగదు సాయం చేస్తామని, పోలీసు కేసులు కొట్టి వేయిస్తామనే హామీలతో ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులను వారివైపు తిప్పుకుంటు న్నారు. కండువాలు మార్చే క్రమంలో కుల సమీకరణలు కూడా భారీగా కన్పిస్తున్నాయి. ఆ ప్రాంతంలో బలమైన సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకున్ని గుర్తించి వారి పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్నారు. భవి ష్యత్తుపై లెక్కలు వేసుకుంటున్న కుల రాజకీయ నాయకులు పార్టీల్లోకి చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. కొత్త వారిని పార్టీలోకి తీసుకునే సయమంలో అప్పటికే పార్టీలో ఉన్న స్థానిక నాయకులు కొత్తగా చేరేవారిని వ్యతిరేకిస్తున్నారు. ఉదయం ఓ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సాయంత్రం సరికి ప్రత్యర్థి పార్టీలోకి చేరిపోతున్నారు. గంటల వ్యవధిలోనే నాయకుల కండువాలు ఇట్టే మారుతున్నాయి. కనీస ప్రభావం చూపే నాయకున్ని ఎవరినీ వదలకుండా లాగేందుకు టిడిపి, వైసిపి రెండూ గట్టిగానే ప్రయత్నిస్తున్నాయి.

ముఖ్యనేతలు సైతం కండువాలు మార్చేస్తున్నారు..!

ద్వితీయ శ్రేణి నాయకులే కాదు.. ఏకంగా టికెట్ ఆశించిన నియోజకవర్గ ముఖ్య నాయకులు సైతం పక్క పార్టీలోకి దూకేస్తున్నారు. ఇప్పటికే కళ్యాణదుర్గం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు ఆ పార్టీని వీడిని వైసిపిలో చేరారు. ఇక హిందూపురం వైసిపి మాజీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ సైతం ఆ పార్టీకి గుడ్‌పై చెప్పి చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. కదిరిలో అత్తార్ చాంద్‌బాషా టిడిపిని వీడి వైసిపిలో చేరారు. రాయదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి వైసిపిని విభేదించి బిజెపిలో చేరారు. ఇలా గత రెండు వారాల్లో పదుల సంఖ్యలోనే ముఖ్య నాయకులు పక్క పార్టీలోకి దూకేశారు.

జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరుతున్న కళ్యాణదుర్గం టిడిపి ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు(ఫైల్‌ఫొటో)

చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరుతున్న హిందూపురం వైసిపి మాజీ సమన్వయకర్త మెహమ్మద్ ఇక్బాల్

అనంతపురం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా ఈదుల్ ఫితర్

- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పలువురి శుభాకాంక్షలు

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈదుల్‌ఫితర్ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం నాడు అన్ని ప్రాంతాల్లోనూ ముస్లిములు పండుగను సంబరంగా జరుపుకున్నారు. రంజాన్ మాసంలో నెల రోజులపాటు ముస్లిం సోదరులు చేపట్టిన ఉపవాస దీక్షలు బుధవారంతో ముగిశాయి. గురువారం నాడు ఈదుల్ ఫితర్‌ను జరుపుకున్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ఉదయం 9 గంటలలోపు ప్రార్థనలు ముగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అనంతపురం నగరంలోని ఈద్గా మైదానంలో ఉదయం నిర్వహించిన ప్రార్థనల్లో వందలాది మంది ముస్లిములు పాల్గొన్నారు. దీంతోపాటు నగరంలోని ఇతర మసీదులు, ఈద్గా మైదానాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు మౌలానాలు, పెద్దలు పవిత్ర రంజాన్ విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సేవ, సాయం, ధాతృత్వం, ధార్మిక చింతన కలిగి ఉండాలని ఉపదేశం ఇచ్చారు. ఎన్నికల సమయం కావడంతో అభ్యర్థులు అందరూ ఆయా ప్రాంతాల్లో ఈద్గాల వద్దకెళ్లి ముస్లిములకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాశక్తి -అనంతపురం

బడుగుల ఆశాజ్యోతి పూలే

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

బడుగ, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే 198వ జయంతి వేడుకలను నిర్వహించారు. పూలే చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే చరిత్రలో నిలిచిపోయిన వ్యక్తి అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నేటికీ కీర్తింపబడుతున్నారంటే ఆయన చేసిన సేవలు ఎంతో గొప్పవో గుర్తించాలన్నారు. నేటి యువత జ్యోతిబా పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంటరానితనం, కులవివక్షత నిర్మూలన, మహిళోద్ధరణ, విద్యాభివద్ధికి ఎనలేని కషి చేసిన వ్యక్తి పూలే అన్నారు. జరగబోయే సాధారణ ఎన్నికల్లో మహిళలు ఎక్కువ శాతం బయటికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో బీసీ వెల్ఫేర్, ఐసిడిఎస్, సాంఘిక సంక్షేమ శాఖల తరఫున మహిళల అభివద్ధికి అవసరమైన అన్ని రకాల కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకోసం అధికారులు అంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, ఎస్డీసీ ఆనంద్, డిపిఒ ప్రభాకర్ రావు, ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రామసుబ్బారెడ్డి, ఐఅండ్ పిఆర్ డిఐపిఆర్ఒ గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఎలాంటి లోటుపాట్లు లేకుండా

అబ్జర్వర్ల పర్యటనకు ఏర్పాట్లు

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల అబ్జర్వర్ల రాక దృష్ట్యా జాగ్రత్తగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాకు సాధారణ ఎన్నికల అబ్జర్వర్‌ల రాక నేపథ్యంలో గురువారం అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గహంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బి అతిథి గహంలో అవసరమైన మరమ్మతులు శాశ్వతంగా నిలిచేలా చేపట్టాలని, అతిథి గహాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అవసరమైన ఛైర్స్, టేబుల్స్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని, అబ్జర్వర్లకు అవసరమైన రిపోర్టులను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అబ్జర్వర్ల కోసం ఏర్పాటుచేసిన అధికారుల టీంలు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, ఆర్డీవో జి.వెంకటేష్, ఆర్‌అండ్‌బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, నోడల్ అధికారులు, లైజన్, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఓటర్లు నమోదైన యువత తమ ఓటు హక్కును సమాజాభివృద్ధి దోహదపడే వారిని ఎన్నుకోవడానికి ఆయుదంగా తప్పకుండా వినియోగించుకోవాలని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్ అన్నారు. గురువారం కురుగుంట గ్రామ పరిధిలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 2, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఓటర్స్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సి.భరత్ సాయి వర్ధన్, అభిషేక్, సాకే రాజా, నెహ్రూ యువ కేంద్రం జాతీయ యువ వాలంటీర్లు జి.నందిత, కురబ దివ్యతేజ, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి శివ, మహేంద్ర ధోని తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ప్రతిపౌరునికీ ఓటుహక్కు వజ్రాయుధం అని, అలాంటి ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి రాణీసుస్మిత, డీఎస్పీ బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటుహక్కు కలిగిన ప్రతి పౌరుడూ మే 13న జరిగే ఎన్నికల్లో పాల్గొని నిర్భయంగా ఓటు వేయాలన్నారు.

అవగాహన ర్యాలీలు

కళ్యాణదుర్గంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారి సుస్మిత

రాయదుర్గం : పట్టణంలోని చౌడమ్మ గుడివీధిలో పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షులు పార్వతి ఆధ్వర్యంలో గురువారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 'నీ ఓటు -నీ భవిష్యత్తు' అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్రమాదంలో భారత రాజ్యాంగం : బీఎస్పీ

రాయదుర్గం : దేశంలో భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని బహుజన్ సమాజ్ పార్టీ రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి చిందనూరు నాగరాజు గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు బీఎస్పీ నాయకురాలు మాయావతిని ప్రధానిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని మతాలు జాతులకు సమాన ప్రాతినిధ్యం ఉండాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన రాజ్యాంగాన్ని జాతీయవాదం పేరుతో దాడి చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో ఏర్పడినందున ఆ పార్టీకి, బిజెపికి అంతర్గతంగా మద్దతు ఇస్తున్న వైసిపికి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయరాదని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సిపిఎం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల వద్ద సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ఇందులో భాగంగా హెచ్ఎల్‌సి కెనాల్ సిపిఎం స్థూపం వద్ద ఈద్గాకు వచ్చిన ముస్లిములకు చల్లటి మజ్జిగ పంపిణీ చేస్తూ ఈద్ ముబారక్ తెలిపారు. వారితో అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నేతలు మాట్లాడుతూ సిపిఎం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ప్రతి రంజాన్ పండుగకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి తమకున్న సేవాభావాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. 15 సంవత్సరాలుగా సిపిఎం మంచి నీరు, మజ్జిగను పంపిణి చేస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, కెవిపిఎస్, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు నాయకులు రాము, చిరంజీవి, ప్రసాద్, ప్రకాష్, అంజి, మోహన్, జగన్, రామాంజనేయులు, పక్రు, వలీ, బాబు, ఇస్మాయిల్, ఉమర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ఒక్క అవకాశమివ్వండి..అభివృద్ధి చేసి చూపుతా..

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

'రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను.. ఒక్క అవకాశం ఇవ్వండి.. గతంలో ఏ నాయకుడూ చేయని అభివృద్ధి చేసి చూపుతా..' అంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం కూడేరు మండలం బ్రాహ్మణపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వై.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రైతు రుణమాఫీ రూ.2 లక్షలు, మహాలక్ష్మి పథకం కింద సంవత్సరానికి ప్రతి మహిళకూ రూ.లక్ష, ప్రత్యేక హోదా, రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ.400 వేతనం, కేజీ టు పీజీ వరకూ ఉచిత విద్య, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు రూ.4వేలు, నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీకి భరోసా వంటి హామీలు అమలు చేయనున్నట్లు తెలిపారు. వీటితోపాటు నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తానన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్లను అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి

గుంతకల్లులో కౌన్సిలర్లు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణానికి చెందిన ఆరుగురు వైసిపి కౌన్సిలర్లు స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. 15వ వార్డు మాజీ కౌన్సిలర్ తాడూరు గోపీ, 32వ వార్డు కౌన్సిలర్ వై.సుధాకర్, 9వ వార్డు కౌన్సిలర్ పి.రవీంద్రకుమార్, 5వ వార్డు కౌన్సిలర్ ఎనుముల భాస్కర్, 37వ వార్డు కౌన్సిలర్ పి.లలిత, 35వ వార్డు మాజీ కౌన్సిలర్ అహ్మద్ బాషా టిడిపిలో చేరారు. వీరికి టిడిపి అభ్యర్థి గుమ్మనూరు జయరామ్, సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించి టిడిపి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. తాను గెలిచిన తర్వాత ఇక్కడే ఉండి నియోజకవర్గం అభివృద్ధి కృషి చేస్తానన్నారు. అంతేగాకుండా ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముక్కన్నగారి గుణశేఖర్, కెసి.హరికుమార్, బండారు ఆనంద్, కోడి శీనా, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీస్.కృష్ణారెడ్డి, కౌన్సిలర్, ఉడదల ప్రభాకర్, రమేష్‌గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు, బిజెపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలోకి కౌన్సిలర్లను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్

'కూటమి'దే అధికారం : 'కాలవ'

ప్రజాశక్తి-రాయదుర్గం

వచ్చే లోకసభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలువ శ్రీనివాసులు ధీమా వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం రాయదుర్గంలోని సీతారామాంజనేయ సత్రంలో కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బిజెపి, జనసేన, టిడిపి కూటమిగా ఏర్పడినట్లు తెలిపారు. కూటమి అభిప్రాయాలు తెలుసుకుని వాటిని అమలు చేయాలని, అందరినీ కలుపుకుని వచ్చే ఎన్నికల్లో కూటమి గెలుపునకు కృషి చేయాలన్నారు. కూటమిలో పని చేసిన వారికి గుర్తింపు గౌరవం ఉంటుందన్నారు. ప్రత్యర్థికి అవసరమైన అర్హత లేవన్నారు. కేవలం ధనం మీదనే ఆధారపడి పోటీ చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ నాలుగు నెలల్లో వైసిపి నుంచి 3000 కుటుంబాలు టిడిపిలో చేరాయన్నారు. 1994లో జరిగిన ప్రభంజనం తిరిగి పునరావృతం అవుతుందన్నారు. మోడీ దేశ, విదేశాల్లో విశేష ఆదరన ఉందన్నారు. ఇక జనసేన నాయకులు పవన్‌కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగమే చేశారని కొనియాడారు. ఎన్నికల అనంతరం డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడి విప్లవాత్మకమైన మార్పులు తీసుకురానున్నట్లు తెలిపారు. జనసేన నాయకులు మంజునాథ్‌గౌడ్ మాట్లాడుతూ జగన్ సర్కార్ హయాంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గతంలో కాలవ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహించినప్పుడు రాయదుర్గంలో 90 శాతం అభివృద్ధి జరిగితే వైసిపి అధికారంలోకి వచ్చాక అరకొర పనులు కూడా నిలిచిపోయాయన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఇనాయత్‌బాషా, బిజెపి రాయదుర్గం పట్టణ అధ్యక్షులు అంబాజీరావు, నాయకులు హీరోజీరావు, వసుంధర, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ఘనంగా రంజాన్ వేడుకలు

రాయదుర్గంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి-అనంతపురం

క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతనల కలయిక రంజాన్ పర్వదినం అని ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకట రామిరెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం అనంతపురం నగరంలోని ఈద్గా మైదానంలో ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, మేయర్ మహమ్మద్ వసీంతో కలిసి ముస్లిములకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల అనంతరం ఆత్మీయ ఆలింగనం చేసుకుని అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. అల్లా దీవెనలతో సమస్త మానవాళికి సకల శుభాలు కలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు కాగజ్ ఘర్ రిజ్వాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు సైఫుల్లా, కో ఆప్షన్ సభ్యుడు శంషుద్దీన్, మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి మహబూబ్‌బాషా, నాయకులు ఖాదర్, జావిద్, మైనార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : పూలే జయంతిని పురస్కరించుకుని దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఎంఆర్‌పిఎస్ నాయకులు వెంకటాపురం చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ అక్కులప్ప, బీసీ సంఘం నాయకులు బండి పురుషోత్తం, వడ్ల విశ్వరూపాచారి, సాయి, నారాయణ, యల్లప్ప పాల్గొన్నారు.

ఉరవకొండలో కేశవ్ ప్రార్థనలు

అనంత మేయర్‌కు దగ్గుపాటి శుభాకాంక్షలు

నార్పల : మండల కేంద్రంలో గురువారం రంజాన్ పండుగ (ఈద్ ఉల్ ఫితర్)ను ముస్లిములు ఘనంగా జరుపుకున్నారు. నెలరోజులపాటు కఠోర ఉపవాసాల అనంతరం ముస్లిం సోదరులు పండుగను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక జామియా మజీద్ నుంచి ముస్లిం మతపెద్దలు ఈద్గా వరకూ ర్యాలీగా వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ హఫీజ్ ఫయాజ్, మత గురువులు జకియ మౌలానా, మౌలానా ఫరూక్ మౌలానా, హఫీజ్ మన్సూర్, ముతవల్లి డిపో శంషుద్దీన్ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంతోపాటు ముచ్చుకోట, వరదాయపల్లి, పెద్దవడుగూరు, పెద్దవడుగూరులూరు తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను నిర్వహించారు. ఇందులో భాగంగా ముస్లిములు ఉదయాన్నే స్థానిక మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రాయదుర్గం : పట్టణంలో గురువారం రంజాన్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైఫుల్లా పట్టణంలోని బళ్లారి రోడ్డు ఈద్గా, కణేకల్ రోడ్డులోని ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు చేశారు. టిడిపి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు కాలవ శ్రీనివాసులు, మెట్టు గోవిందరెడ్డి ప్రార్థనల్లో పాల్గొని ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు.

బొమ్మనహాళ్ : మండలవ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లిములు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా నేమకల్లు, ఉంతకల్లు, చంద్రగిరి, కళ్లహోళ, తారకాపురం, గోవిందవాడ, దర్గాహొన్నూరు, గోనేహాళ్, శ్రీధర్‌ఘట్ట, ఎలంజి, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ ఈద్గామైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వజ్రకరూరు : ముస్లిములు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయా దర్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు వై.విశ్వేశ్వరరెడ్డి, పయ్యావుల కేశవ్, వై.మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా ముస్లిములతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం మత పెద్దలకు, ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో ముస్లిం మత పెద్దలు, రాయలసీమ జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిఖిలేనాథ్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, ముస్లిములు, పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలవ్యాప్తంగా ముస్లిములు రంజాన్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే భారీ ఎత్తున ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అనంతపురం కలెక్టరేట్ : మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తోందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. గురువారం నగరంలో ముస్లిం సోదరులతో ఈద్గా మైదానంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రార్థనలు నిర్వహించారు. దగ్గుపాటి ప్రసాద్ ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

స్ఫూర్తినీయుడు 'పూలే'

జయంతి కార్యక్రమంలో జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

మహాత్మా జ్యోతి రావు పూలే గొప్ప సాంఘీక విప్లవకారుడు అని జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా గురువారం స్థానిక జెఎన్‌టియులో విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ దేశంలో సమానత్వం, గ్రామీణ ప్రాంతాల మహిళల విద్యాభివృద్ధికి పోరాడిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. ముఖ్యంగా మహిళా విద్యపై ప్రత్యక శ్రద్ధ చూపారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, జి.వి.సుబ్బారెడ్డి, పి.ఆర్.భానుమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, ఎం.రామశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రాజు, అజిత, వి.సి.పి.ఎ.శ్రీసునీల్, రిజిస్ట్రార్ పిఏ శ్రీసాయిమనీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బిసి ఉద్యోగం ఆధ్వర్యంలో..

దేశ తొలి సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎపి బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా చంద్రమోహన్ అన్నారు. పూలే జయంతి సందర్భంగా గురువారం జిల్లా పరిషత్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, నిమ్నజాతుల విద్యాదాత, బడుగు, బలహీన వర్గాల ఆరాధ్యదైవం పూలే అన్నారు. ప్రతి ఒక్కరూ పూలే ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బి.సి ఉద్యోగుల సంఘం నాయకులు మోతిరావు, అనంతసేన, శివరుద్రం, మహేష్, వెంకటస్వామి, బి.సి సంక్షేమ సంఘం నాయకులు ఆవుల చక్రధర్‌యాదవ్, కడియాల రామాంజి, విష్ణు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ నగరంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దళవాయి వెంకటనారాయణ, సిమెంట్ పోలన్న, కష్ణకుమార్, పోతుల నరసింహులు, గంగవరం బుజ్జి, మాజీ జెడ్పీ చైర్మన్ చమన్ సాబ్ తనయుడు ఉమర్, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో నివాళులర్పిస్తున్న బిసి ఉద్యోగ సంఘం నాయకులు

నార్పలలో నివాళులర్పిస్తున్న అధికారులు

పామిడి : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఓబులేసుయాదవ్, బీఎస్పీ జిల్లా నాయకులు వెంకట,

పూలేకు నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు విసి, సిబ్బంది

బహుజన నాయకులు ఎదురూరు మల్లికార్జున, సీనియర్ జర్నలిస్టు కుమార్, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు, కొండాపురం రంగనాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు లాలెప్ప, కొండాపురం బాలరాజు, కొండాపురం రవి, కొండాపురం మధు, కొట్టాల ఓబులేసు, కొండాపురం మారన్న, అరవ భీముడు, హోటల్ గోవిందు, చైతన్య కాలనీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రాముడు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే సమాజానికి చేసిన సేవలను వివరించారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

వజ్రకరూరు : పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిజిహెచ్‌ఎస్ఎస్ వ్యవస్థాపన అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ సమాజంలో దురాచారాలు, మూఢనమ్మకాలు, కులవ్యవస్థ, స్త్రీ అణచివేతపై పూలే ఎనలేని పోరాటాలు చేవారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనందరాజు, మోపిడి వన్నూరుస్వామి, జ్యోతిబాపూలే కమిటీ సభ్యులు చాబాల ఈశ్వరయ్య, బండి గోపీ, అమిద్యాల నారాయణస్వామి, హోతూరు నెట్టికంటయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ చింతా ప్రసాద్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి భోగాతి రామేశ్వర్‌రెడ్డి, నాయకులు తలారి రామకృష్ణ, వడ్డే రామాంజనేయులు, నీలూరు రాజా, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పూలే జయంతిని పురస్కరించుకుని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు గురువారం ప్రజా వేదిక వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ బడుగుల హక్కుల సాధన కోసం పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాముడు

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన మైనర్ కెనాల్ డీసీల్టింగ్ పనులను ఎంపిడిఒ రాముడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ప్రతికూలీ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వేసవికాలం కావడంతో ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి చేరి 11గంటలకు ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని పెద్దాసుపత్రి వద్ద పేదలకు గురువారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు, తమ తమ్ముడు కమలాకర్ సతీమణి భాగ్యలక్ష్మి కుమారుడు లక్ష్మీధర్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. దాదాపు 200 మందికి అన్నదానం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్బారావు, ఓబుళపతి, కిష్టప్ప, రవికుమార్, లక్ష్మీనారాయణ, బాలాజీ, రాజు, ముకుంద, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

టిడిపిలో పలువురు చేరిక

టిడిపిలోకి చేరిన వారితో కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని కదరంపల్లి గ్రామానికి చెందిన 30 వైసిపి కుటుంబాలు గురువారం టిడిపిలోకి చేరాయి. ఇందులో భాగంగా టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నివాసంలో కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కదరంపల్లి గ్రామానికి చెందిన బొమయ్య, ఎర్రిస్వామి, రాజశేఖర్, ధనుంజయ, కృష్ణమూర్తి, నాగేంద్ర, రమేష్, రవి, మల్లికార్జున, గంగాధర్, నాగరాజు, చిన్నమూర్తి, హనుమంతు, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మంజునాథ, మండల కన్వీనర్ హనుమంతు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మల్లికార్జున, భోజరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాట సుంకులమ్మ ఉత్సవాలు

పుట్లూరు : మండల కేంద్ర సమీపంలో వెలసిన బాట సుంకులమ్మ తిరుణాల వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

భూమిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

తిరుణాలను పురస్కరించుకుని మండల పరిధిలోని నాయకునిపల్లి సమీపంలో వెలసిన సుంకులమ్మ ఆలయం వద్ద గురువారం భూమిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ బి.సునీత, ఎంపిపి రాఘవరెడ్డి, ఎస్.గూడూరు ఎంపిటిసి భూమిరెడ్డి గారి నాగార్జునరెడ్డి, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న భూమిరెడ్డి ట్రస్టు సభ్యులు

నేడు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పర్యటన

పుట్లూరు : 'మన ఊరికి మన వీరా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యల్లనూరు మండలంలో పర్యటించనున్నట్లు మండల వైసిపి నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోడుమూర్తి గ్రామం నుంచి ప్రారంభమై చిలమకూరు, అచ్యుతాపురం, బొప్పేపల్లి, వాసాపురం, కూచివారిపల్లి గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. అనంతరం వాసాపురం గ్రామంలో పల్లెనిద్ర చేస్తారన్నారు. కావున మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-వజ్రకరూరు

మండలంలోని షేక్షానుపల్లి, చిన్నముష్టూరు గ్రామాలకు చెందిన 50 టిడిపి కుటుంబాలు గురువారం వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ తమను నమ్మి వచ్చిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కులం, మతం, వర్గం, భేదం, ప్రాంతం తేడా లేకుండా పాలన అందించామన్నారు. రానున్న రోజుల్లో కూడా అలాగే కొనసాగుతుందన్నారు. పార్టీలోకి చేరిన వారిలో షేక్షానుపల్లి గ్రామానికి చెందిన జెసిబి పూసల రమేష్, బాన్నేల రమేష్, రామిరెడ్డి, కొమ్మే ఈశ్వర్, ప్రసాద్, దాదా, గొరవ పవన్, రాజప్ప, అయ్యప్ప రెడ్డి, గొరవ మల్లయ్య, గొరవ మల్లికార్జున, గోపాల్, విజయ్, సురేంద్ర, వన్నూరు స్వామి, చిన్నముష్టూరు గ్రామానికి చెందిన నాగరాజు, లాలుస్వామి, తిమ్మప్ప, మల్లి, రాధమ్మ వీరాంజి, శంకరప్ప, సాయి, ఓబులరాజు, వీరాంజనేయులు, కృష్ణమూర్తి, సూరి, వీ.లాలూస్వామి, రామాంజనేయులు, వన్నూరుస్వామి ఉన్నారు. అనంతరం యువనేత వై.ప్రణయ్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కాగా విడపనకల్లు మండలం ఆర్.కొట్టాల గ్రామానికి చెందిన సిఎం జగన్ అభిమాని అడవి రాజు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో రూ.10వేల చెక్కును పార్టీ ఫండ్‌కు అందజేశారు. అనంతరం జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి వజ్రకరూరు మండలం కొత్త కడమలకుంట, పాత కడమలకుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, విడపనకల్, ఉరవకొండ పట్టణ, రూరల్ కన్వీనర్లు బసన్న, ఏసీ ఎర్రిస్వామి, సుంకన్న, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


పార్టీ ఫండ్‌చెక్కు అందజేస్తున్న అడవి రాజు

వైసిపిని మరోసారి ఆశీర్వదించండి : వీరాంజనేయులు

ప్రజాశక్తి-శింగనమల

పేదల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సిఎం జగన్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధిలోని పెరవలి, పెద్ద జలాలపురం గ్రామాల్లో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించారన్నారు. కావున మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి, మాజీ ఎడిసిసిబి ఛైర్మన్ పామిడి వీరాంజనేయులు, సింగిల్ విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, సర్పంచి తరిమెల రాజా రామ్మోహన్‌రెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, శెట్టిపల్లి నరసింహారెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చిక్కెళ్ల బాలకృష్ణ, ముచ్చుకోట శ్రీకాంత్‌రెడ్డి, జూలకాలువ డీలర్ సూర్యనారాయణ, ఎన్‌వి.నారాయణ, చెన్నకేశవులు, చిన్నమట్లగొంది శివమ్మ, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైసిపి నాయకులు

కళ్యాణదుర్గం అభివృద్ధికి కృషి

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా, అమిలినేని

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలూ కృషి చేస్తామని టిడిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, అమిలినేని సురేంద్రబాబు భరోసా ఇచ్చారు. గురువారం కంబదూరు మండల పరిధిలోని ములకనూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. ముఖ్యంగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. తిరిగి అభివృద్ధి గాడిన పడాలంటే టిడిపి అధినేత చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, దండా వెంకటేశులు, మాలకొండ వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఆత్మీయ సమ్మేళనంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు

రాయదుర్గం : వడ్డెర్ల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని సీతారామాంజనేయ సత్రంలో వడ్డెర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర్ల కోరిక మేరకు రాయదుర్గం నుంచి 75- వీరాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో వడ్డెర్ల కళ్యాణ మండపాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆదర్శ పాఠశాలలో ప్రవేశం, వసతి గృహంలో ప్రవేశం మొదలైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు తన 40ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక మెడికల్ కళాశాలనైనా తెచ్చారా అని ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి వచ్చాక 53 వేల ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. అలాగే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే తిరిగి సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప, నాయకులు మాధవరెడ్డి, గౌని ఉపేంద్రరెడ్డి, సిద్దప్ప, గోవింగ, ఆరవ శివప్ప, గౌని లక్ష్మీకాంతరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గోవింద, వడ్డే గోవిందప్ప, పైతోట రఘు, జయచంద్ర, మహేష్, వడ్డెర్లు పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

వజ్రకరూరు : బీఎస్పీ ఎంపీ అభ్యర్థి బోనాసి నారాయణప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి అంకే తిప్పేస్వామి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని కవితా సర్కిల్, గుంతకల్లు రోడ్లలో చిరువ్యాపారుల వద్దకు వెళ్లి వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ పార్టీకి ఓటు వేసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను మోసం చేశాయన్నారు. ముఖ్యంగా బడుగులకు రాజ్యాధికారం దక్కకుండా చేస్తున్నాయన్నారు. బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షిరాం అడుగుజాడల్లో నడిచి జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చీనీతోటకు నిప్పు

కాలిన చీనీతోటను చూపుతున్న రైతు విభూది జమ్మన్న, భార్య కుళ్లాయమ్మ

శింగనమల : గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన రైతు ఈబూది జమ్మన్నకు చెందిన చీనీతోటకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. వివరాల్లోకి వెళ్తే... కల్లూరు గ్రామానికి చెందిన జమ్మన్న తనకున్న 6.50 ఎకరాల భూమిలో చీనీ, మామిడి, మొక్కజొన్న పంటలు సాగు చేశాడు. చీనీ పంటను గురువారం కోయాల్సి ఉంది. అయితే రంజాన్ కావడంతో శుక్రవారం నాటికి వాయిదా వేసుకున్నారు. దీంతో దైవ దర్శనానికి గూగూడు వెళ్లారు. ఈనేపథ్యంలో గుర్తు తెలియ వ్యక్తులు తోటకు నిప్పు పెట్టడంతో దాదాపు 150 మామిడి చెట్లు కాయలతో సహా పూర్తిగా కాలిపోయాయని బాధిత రైతు వాపోయాడు. వీటితోపాటు మామిడి చెట్లు కూడా కాలిపోయినట్లు తెలిపారు. ఫలితంగా రూ.5లక్షల వరకూ నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. నిప్పు పెట్టిన దుండగులను అరెస్టు చేయడంతోపాటు ప్రభుత్వ తమను ఆదుకోవాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

గుత్తి : మండల పరిధిలోని ఎంగిలిబండ గ్రామ శివారులో బైక్‌ను ఢీకొని ఇద్దరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎం.వెంకట రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గుత్తి మండలం ఎంగిలిబండ గ్రామశివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం తాడిపత్రి వైపు నుంచి ఎదురుగా వచ్చిన కారు ఢీకొన్న ప్రమాదంలో తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు చంద్రశేఖరెడ్డి (26), శివానందరెడ్డి(24) అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. మృతుల తండ్రి రామసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా కారును అతివేగం, నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై సెక్షన్ 304-ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కారు డ్రైవర్ కూడా గాయాలపాలై కర్నూలులో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు యల్లనూరు మండలం తిరుమలాపురం గ్రామనికి చెందిన పాలెం కిషోర్‌కుమార్‌రెడ్డి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని 250 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

దుష్టశక్తులకు బుద్ధి చెప్పాలి : వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-పామిడి

ప్రశాంతతకు మారుపేరైన గుంతకల్లుకు వచ్చిన కొన్ని దుష్టశక్తులకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని కొండాపురం, కొత్తపల్లి గ్రామాల్లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా దాదాపు 80 శాతం అభివృద్ధి పనులు చేశానన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, నీటి సమస్యలు పరిష్కరించామన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.సునీల్‌కుమార్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి, మునగల రంగనాయకులు, ఖాసీం, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, జడ్పిటిసి శోభ మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు జానకిరామిరెడ్డి, అనిమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వై.వెంకటరామిరెడ్డికి హారతి ఇస్తున్న మహిళలు

వాహనాల తనిఖీ

పెద్దపప్పూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం పరిధిలోని రహదారిలో ఎస్ఐ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల దృష్టా డబ్బులు, వస్తువులు, ఇతర సామగ్రిని తరలించకుండా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ప్రలోభాలకు పాల్పడకూడదన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్రంలో కుంటుపడిన అభివృద్ధి మళ్లీ పట్టాలెక్కాలంటే తప్పనిసరిగా టిడిపి అధికారంలోకి తెచ్చుకుని చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందని ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు అన్నారు. గురువారం మండల పరిధిలోని చాములూరు, నిలువురాయి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. దీంతో చాలామంది వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరుతున్నారన్నారు. కావున ప్రజలు తప్పకుండా టిడిపికి ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి 2బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, పిట్టు రంగారెడ్డి, ఆలం నాగార్జుననాయుడు, ఎర్రినాగప్ప, ఆకుల అనిల్, ఆకుల రవితేజ, జాఫర్, రాజన్న, లక్ష్మీనారాయణ, రాముడు, కుళ్లాయప్ప, శీనా, భాస్కర్, ఆనంద్, ఆది, ఎర్రినాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు